www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 డిసెంబర్ 2023



అందుబాటులో ఆర్‌టిసి సేవలు

భీమవరం : జిల్లాలోని నాలుగు డిపోల నుంచి భక్తుల సౌకర్యార్థం పంచరామదర్శని, ఏకాదశరుద్రుల యాత్ర, శివ కేశవ దర్శిని, అరుణాచలం, మన్యసీమ దర్శని వంటి యాత్రలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి అడ్డగడ వీరయ్యచౌదరి తెలిపారు. వీటితో పాటు శబరిమలై వెళ్లే స్వాములకు కూడా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అరుణాచలం, పంచరామ క్షేత్ర దర్శిని యాత్రలకు భక్తుల నుంచి విశేష స్పందన రావడం చాలా సంతోషమన్నారు. ఆర్‌టిసి అందుబాటులోకి తీసుకొచ్చిన సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు, వీడియో కోచ్ హైటెక్ బస్సులు, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను ఈ యాత్రలకు ప్రయాణికుల కోరిక మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు, వ్యాపారులకు, ఉద్యోగస్తులకు వారు కోరిన రోజు, కోరిన ప్రదేశం నుంచి శ్రీశైలం, భద్రాచలం, అన్నవరం, తదితర పుణ్యక్షేత్రాలకు పేరుపాలెం బీచ్, ఉప్పాడ బీచ్ తదితర విహారయాత్ర ప్రదేశాలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తడిచిన ధాన్యానికి 'మద్దతు' ఏదీ..!

తేమ 17 శాతానికి మించితే కేజీల లెక్కన కటింగ్

ఆరబెట్టేందుకు చోటులేక రైతులు నానావస్థలు

రంగుమారిన, మొలకెత్తిన ధాన్యంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరం

ఆదుకోవడం అంటే ఇదేనా అంటూ రైతన్న ఆగ్రహం

రెండు జిల్లాల్లోనూ 2.40 లక్షల ఎకరాల్లో పంట పొలాల్లోనే

నేలనంటి, నీటిలో నానుతున్న పంటనే అత్యధికం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ప్రతి రైతునూ ఆదుకుంటాం. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం' అంటూ సిఎం నుంచి మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులు సైతం చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం దానికి విరుద్ధమైన పరిస్థితులు కన్పిస్తున్నాయి. తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకూ ఎటువంటి ఆదేశాలనూ ప్రభుత్వం విడుదల చేయలేదు. తేమ 17 శాతానికి మించితే బస్తాకు కిలో ధాన్యం తగ్గించి మిల్లర్లు ధర నిర్ణయిస్తున్నారు. 25 శాతం తేమ వరకూ కొనుగోలు చేస్తారని చెబుతున్నా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మాత్రం కొనుగోలు చేయడం లేదు. తుపాను వెళ్లి ఐదు రోజులు గడిచినా ఇప్పటి వరకూ తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకూ లేకుండాపోయింది. దీంతో తడిచిన, మొలక వచ్చిన ధాన్యాన్ని అయినకాడికి అమ్మడం తప్ప రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. తుపాను వచ్చేసరికి 40 శాతం వరకూ మాసూళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండు జిల్లాల్లోనూ దాదాపు 2.40 లక్షల ఎకరాల్లో పంట మాసూళ్లు పూర్తి కాకుండానే ఉండిపోయింది. తుపానుకు ముందు మాసూళ్లు పూర్తయిన ధాన్యం సైతం రెండు జిల్లాల్లోనూ 20 వేల టన్నులకుపైగా ఉన్నట్లు అధికారుల మాటలు చెబుతున్నాయి. ధాన్యపురాశులు నీట మునగడంతో అడుగుభాగం మొత్తం తడిచి ముద్దయ్యింది. మొలకలు సైతం వచ్చిన పరిస్థితి. అటువంటి ధాన్యం కొనుగోలుపై నీలినీడలు అలుముకున్నాయి. తడిచిన, రంగుమారిన ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాకపోవడంతో కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు చేస్తామని అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారు. ఆరబెట్టుకునేందుకు చోటులేక రైతులు నానావస్థలు పడుతున్నారు.



మొలకలు వచ్చిన ధాన్యం

కేజీల లెక్కన కటింగ్‌లతో కొనుగోలు

ధాన్యం 25 శాతం తేమ ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తామనే ప్రకటనలతో రైతులకు ఎటువంటి న్యాయమూ జరగని పరిస్థితి ఉంది. 17 శాతం తేమ దాటిన తర్వాత ఒక్కో శాతం తేమకు బస్తాకు కిలో ధాన్యం తగ్గించి ధర నిర్ణయిస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తుపాను దెబ్బకు రైతులకు ధాన్యం పొలాల్లోంచి పైకి తెచ్చేందుకు, ఆరబెట్టేందుకు ఎకరాకు రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ ఖర్చవుతోంది. నేలనంటిన పంట దిగుబడి తగ్గడమే కాకుండా, రంగుమారి, మొలకలు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కాకుండా తగ్గించి కొనుగోలు చేస్తే రైతులకు ఏవిధంగా న్యాయం జరుగుతుందో ప్రభుత్వమే చెప్పాలి. తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. తడిచి, రంగుమారిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తుపానుతో దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. రెండు జిల్లాల్లోనూ ఇంకా పెద్దఎత్తున పంట ఉంది. మద్దతు ధర దక్కకపోతే ఎకరాకు తక్కువగా లెక్కించినా రూ.నాలుగైదు వేలు రైతులు నష్టపోతారు. ఖర్చులు అధికం కావడంతోపాటు ధర కూడా తగ్గితే రైతుల పరిస్థితి దయనీయంగా మారనుంది.

తేమశాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

తుపాను ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిచిన ధాన్యం గట్టుపైకి తేవడానికి పెద్దఎత్తున అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. తేమశాతంతో నిమిత్తం లేకుండా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. పంట నేలనంటడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా, ఖర్చు పెరుగుతోంది. తడిచిన, రంగుమారిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. కిలోల ప్రాతిపదికన కోతలు పెట్టడాన్ని అరికట్టి రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



బాధ్యతలు స్వీకరిస్తున్న యుటిఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ

ముగిసిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

పలు తీర్మానాలు ఆమోదం - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండు రోజులపాటు జరిగిన యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. మినీబైపాస్‌లోని చలసాని గార్డెన్స్‌లో శని, ఆదివారాల్లో జరిగిన ఈ సమావేశాలకు 26 జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ఎదురవు తున్న సవాళ్లపై చర్చించారు. ముఖ్యంగా నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యార్థుల డ్రాపవుట్‌లు పెరగడంపై సమావేశం చర్చించింది. పాఠశాలల విలీనంతో విద్యార్థులు పెద్దసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను వదిలి ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని నేతలు స్పష్టం చేశారు. ముఖ్యంగా మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనం గ్రామీణ ప్రాంత విద్యార్థుల పాలిట శాపంగా మారిందని తెలిపారు. ఉపాధ్యాయుల రేషన్‌లైజేషన్ పేరుతో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గించి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ముందుకెళ్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి సిపిఎస్ కంటే దారుణమైన జిపిఎస్ ఉద్యోగుల మీద బలవంతంగా రుద్ది అదేదో గొప్ప విషయం అన్నట్లుగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. పెండింగ్ డిఎలు, అలవెన్సులు, ఇతర బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. కనీసం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని, ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే వైసిపి ప్రభుత్వానికీ తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన వైఖరి మార్చుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు 12వ పిఆర్‌సిని త్వరితగతిన అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చర్చించి ఆమోదించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్, కోశాధికారిగా బి.గోపీమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 20 మంది ఆఫీస్ బేరర్స్‌గాను, ఏడుగురితో ఆడిట్ కమిటీ, వందమందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి పోరాటాల ఉధృతం చేయాలని, పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా ఉద్యమించాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశాల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, మాజీ ఎంఎల్‌సిలు, సీనియర్ నేతలు పాల్గొని తమ సందేశాలిచ్చారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం



కాళ్ల : సీసలిలో ముంపునకు గురైన భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కాళ్ల

తుపాను కారణంగా నష్టపోయిన కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. సీసలిలో ముంపునకు గురైన భూములను సిపిఎం బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ నూటికి 90 శాతం సాగులో కౌలు రైతులే ఉన్నారని, ప్రభుత్వం కౌలు రైతులకే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిహారం అందించడంతోపాటు దాళ్వా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మండా సూరిబాబు, రైతులు యళ్ల లాజర్, సత్యనారాయణ, గాది మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: తడిచిన ధాన్యాన్ని తేమశాతం చూడకుండా కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావుతో కలిసి తడిచిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాల వల్ల పంటంతా నీటి పాలైందన్నారు. ఎకరానికి రూ.25 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, కనీసం ఆ పెట్టుబడి కూడా తిరిగొచ్చే పరిస్థితి కన్పించడం లేదని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు తోటకూర కొండరాజు, వెంకటరాజు, గుడ్ల వెంకట్రావు పాల్గొన్నారు.



గణపవరం : ధాన్యం పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తణుకు రూరల్ : రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి డిమాండ్ చేశారు. తణుకులో రైతుల వద్ద ఉన్న తడిచిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు పండించిన పంట తడిచి ముద్దయి, మొలకలు వచ్చిందన్నారు. రైతులెవరూ అధైర్యపడొద్దని, ధాన్యం మొలకలు వచ్చినా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటానని సిఎం జగన్ చెప్పారన్నారు. కాని ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తీసుకెళ్తే తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఇలాంటి ధాన్యాన్ని తాము కొనుగోలు చేయమని చెబుతున్నారని రైతులు వాపోయారన్నారు. దళారులు చాలా తక్కువ రేటుకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రోజుకు 50 బరకాలు తెస్తున్నారని ఒక్కొక్క బరకానికి రోజుకు రూ.30 చొప్పున అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



తణుకు రూరల్ : ధాన్యం పరిశీలిస్తున్న అజయ్‌కుమారి



మాట్లాడుతున్న వికలాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజు

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

వికలాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజు

ప్రజాశక్తి - భీమవరం

వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని వికలాంగుల జాతీయ హక్కుల వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లాడి నటరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వికలాంగుల జిల్లా సమావేశం పి.రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజు, ప్రతాప్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వానికైనా వికలాంగులు ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు రావడం బాధాకరమన్నారు. వికలాంగులకు రక్షణగా ఉన్న 2016 చట్టాన్ని రాష్ట్రంలో నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. వికలాంగుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌లో అనేక ఇబ్బందులొస్తున్నాయన్నారు. నేటికీ అర్హతున్న వారికి పింఛన్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల పెన్షన్లకు ఉన్న అన్ని నిబంధనలు తొలగించాలని కోరారు. వికలాంగుల సంఖ్యకు అనుగుణంగా వాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షను రూ.6 వేలు ఇవ్వాలని, ఇంటి స్థలం ఇచ్చి ఉచితంగా ఇల్లు కట్టి ఇవ్వాలని, బ్యాక్‌లాగ్, రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలని, 50 శాతం సబ్సిడీతో రూ.ఐదు లక్షలు రుణాలు ఇవ్వాలని, 35 కేజీలు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని సమావేశం కోరింది.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవాధ్యక్షులుగా పివి.ప్రతాప్, అధ్యక్షులుగా మద్దాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అల్లాడి నటరాజు, గౌరవ కన్వీనర్‌గా ఎం.వైకుంఠం, కన్వీనర్లుగా ఎన్.మహేష్, కె.రమేష్, రామకృష్ణ, మహిళా అధ్యక్షులుగా పి.రత్నకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనవరి 8న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశంలో పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠం, మల్లేశ్వరి, నర్సింహామూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

12న గాలాయిగూడెంలో గవర్నర్ పర్యటన

పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర గవర్నర్ ఈ నెల 12వ తేదీ మంగళవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ఈ నెల 12న దెందులూరు మండలం గాలాయిగూడెంలో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొంటున్న సందర్భంగా ఆయా అధికారులకు విధులను కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ పర్యటనకు పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్‌పిని ఆదేశించారు. గవర్నర్ పర్యటించే మార్గంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగ్గా ఉండాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో షామియానా, డయాస్, తదితర ఏర్పాట్లు చేయాలని, గవర్నర్ పర్యటించే మార్గంలో అవసరమైన ప్రదేశాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బి ఎస్‌ఇని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయమూ లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో అత్యవసర మందులతో అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సంబంధిత అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

కంటి శస్త్ర చికిత్సకు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

కిరాణా దుకాణంలో పనిచేసే పాలకొల్లు పట్టణానికి చెందిన బొడ్డు సముద్రుడు కంటికి సంబంధించిన రెటీనా శస్త్రచికిత్స నిమిత్తం అతనికి అవసరమైన రూ.10 వేల విలువైన మందులు వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ ఆదివారం కొత్త కుళాయి చెరువు వద్ద అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనుషులకు సహాయపడడమే మానవత్వమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, జగ్గురోతు రాంబాబు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో పోటెత్తింది. కార్తీక మాసంలోని ఆఖరి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో బీచ్‌కి ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. వడ్డునున్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు. బీచ్‌లో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, అగ్నిమాపక, ఆరోగ్య, తదితర శాఖల సిబ్బంది విధులు నిర్వహించారు. సముద్రపు అలలతో కొట్టుకుపోకుండా ఉండేందుకు భారీగేట్లను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను నియమించారు. గత ఆదివారం తుపాన్ ప్రభావంతో పర్యాటకులు ఎవరూ రాలేదు. తుపాన్ ప్రభావంతో సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడ్డాయి. దీంతో అధికారులు బీచ్‌కు పర్యాటకుల రాకను నిషేధించారు.




సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు కృషి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రైతుల అభ్యున్నతికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతు బాంధవుడు, కాళ్లకూరు సహకార సంఘ వ్యవస్థాపకుడు పెన్మెత్స వెంకట సోమరాజు శిలా విగ్రహాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడాలనే మంచి ఆశయంతో సహకార సంఘాలను నెలకొల్పినట్లు తెలిపారు. నూటికి 80 శాతం సహకార బ్యాంకులు లాభాల బాటలో పయనిస్తున్నాయన్నారు. రైతు శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయమన్నారు. పరస్పర సహకారంతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని, సహకార సంఘాలు చేయూతనందిస్తాయని చెప్పారు. సంఘ వ్యవస్థాపకులు, పలువురి సొసైటీ అధ్యక్షుల సమష్టి కృషి, గ్రామస్తుల సహకారంతోనే సహకార సంఘం అభివృద్ధి చెంది రైతులకు విశిష్ట సేవలందిస్తున్నాయన్నారు. సొసైటీ బ్యాంక్ స్థాపించిన సంవత్సరం నుంచి 29 సంవత్సరాల పాటు (1939 నుంచి 1968) ఏకచక్రాధిపత్యంగా సంఘ తొలి అధ్యక్షులుగా పెన్మెత్స వెంకట సోమరాజు పనిచేశారన్నారు. సొసైటీ సిఇఒ శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.పది వేలతో ప్రారంభమైన సహకార బ్యాంకు నేడు రూ.37 కోట్ల టర్నోవర్ జరుగుతుందన్నారు. 45 ఏళ్ల నుంచి ఏ గ్రేడ్ తరగతి సొసైటీగా పేరుగాంచి ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. 26 ఏళ్లుగా సభ్యుల నుంచి రికవరీలో ప్రథమ స్థానం పొంది ఏటా అవార్డులు అందుకుంటుందన్నారు. కాళ్లకూరు సొసైటీలో డిపాజిట్లు, రుణాల పెంపుదల, ఇచ్చిన రుణాలు నూరుశాతం వసూలు, సొసైటీ పనితీరు, ప్రగతిని పరిశీలించి ఈ అవార్డు అందించారన్నారు. 2022-23లో బ్యాంకు బకాయిలు నూరుశాతం వసూలు చేసి రూ.37,25,236 నికర లాభం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్లకూరు గ్రామ సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్, ఏలూరుపాడు సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, ఏలూరుపాడు ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, పెన్మెత్స సోమరాజు, పెన్మెత్స వెంకట రామరాజు, దినేష్ వర్మ, భీమవరం బజార్ బ్యాంక్ మేనేజర్ సంజయ్, సూపర్ వైజర్ గోపీ, సొసైటీ ఛైర్మన్ మాధు సురేష్, సొసైటీ సిఇఒ యిబ్బా శ్రీనివాస్, డాక్టర్ నీలాద్రి రాజు, వేగేశ్న విజయరామరాజు, దాట్ల వెంకట రామరాజు, సొసైటీ సభ్యులు పి.వెంకటరమణరావు, అంగర సద్గుణరావు, జువ్వలపాలెం మాజీ సర్పంచి కొండేటి శివకుమార్, బొధనపు కన్నయ్య, దాతల సందీప్, కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సోమరాజు శిలా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పివిఎల్.నరసింహరాజు

లోక్‌అదాలత్‌లో 1,908 కేసుల పరిష్కారం

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 9వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,908 పెండింగ్ కేసులను పరిష్కారం చేయటం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదివారం తెలియజేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరు వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 36 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినదని, వీటిలో ఏలూరులో 9 బెంచీలు, భీమవరం 4, కొవ్వూరు 4, నరసాపురం 3, తణుకు 5, తాడేపల్లిగూడెం 4, పాలకొల్లు 1, నిడదవోలు 2, జంగారెడ్డిగూడెం 2, చింతలపూడి 1, భీమడోలు 1 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 1,610 క్రిమినల్ కేసులు, 40 కుటుంబ వివాద కేసులు, 111 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 147 సివిల్ కేసులను రాజీ చేయగా, 151 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం చేయబడ్డాయని తెలిపారు. వీటిలో ఏలూరు 428, భీమవరం 304, చింతలపూడి 103, జంగారెడ్డిగూడెం 138, కొవ్వూరు 169, నర్సాపురం 162, పాలకొల్లు 58, తాడేపల్లిగూడెం 185, తణుకు 230, నిడదవోలు 68, భీమడోలు 63 కేసులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించామని తెలిపారు. వీటితో పాటుగా జిల్లా వ్యాప్తంగా 6,804 కేసులను కూడా రాజీ చేయడం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రికా విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో విజయవాడ వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖల అందరికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.రత్న ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పిప్పర లైబ్రరీకి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో పిప్పర గ్రంథాలయానికి మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు 200 పుస్తకాలను గ్రంథ పాలకులు పి.రంగారావుకు అందించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ లైబ్రరీకి వస్తున్న పాఠకులకు స్వాతంత్ర్య సమరయోధులు నెహ్రూ, గాంధీ జీవిత చరిత్రలతో పాటు ఆధ్యాత్మిక, ఆంగ్ల సాహిత్యాలు ఉపయోగపడతాయన్నారు. ఎంతో విలువైన సాహిత్యాన్ని అందించిన కృష్ణంరాజుకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఐవి.నరసింహరాజు, గుడ్ల వెంకట కృష్ణారావు, గ్రంథ పాలకులు పి.రంగారావు కృతజ్ఞతలు తెలిపారు.


పంట బోదె పూడిక తీస్తున్న జెసిబి

పంట బోదెల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - ఆచంట


తుపాన్ ప్రభావం వల్ల పంటపొలాల్లో నిలిచిపోయిన మురుగు నీరును బయటకు పంపేందుకు యుద్ధ ప్రతిపాదన పనులు ప్రారంభించినట్లు వల్లూరు, భీమలాపురం సర్పంచులు నేలపూడి బేబీరామోజానరావు, గుబ్బల మాధవరావు అన్నారు. ఆదివారం వల్లూరు, భీమలాపురం పంట బోదెల్లో పూడిక తొలగింపు పనులను యుద్ధ ప్రతిపాదన చేపట్టినట్లు వారు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట బోదెలు పూడుకుపోయాయని, మురుగునీరు కిందకు వెళ్లే విధంగా పంట కాల్వల ప్రక్షాళన చేపట్టామని వివరించారు.


మాట్లాడుతున్న ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

కమ్యూనిటీ పారా మెడికల్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ హెల్పర్ గణపవరం, నిడమర్రు మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సరిపల్లిలో సాయిబాబా ఆలయంలో కేన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అసోసియేషన్ మండలాధ్యక్షులు సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. సదస్సులో పాల్గొన్న ఓమేగా ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్ కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఎస్.జయసూర్య, రాష్ట్ర కార్యదర్శి విబిఆర్.రాజు, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల అధ్యక్షులు ఎఆర్.పరమేశ్వరరావు, ఆనందం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి సుభాని, మండల కార్యదర్శి వి.ఎస్.శ్రీనివాస్, గణపవరం, నిడమర్రు మండల ఇసి సభ్యులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కలిదిండి

మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని లూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మం డలంలోని కోరు కొల్లులో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి చన్నంశెట్టి కోదండరామయ్య, సొసైటీ అధ్యక్షులు అంకెం నరసయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తండ్రి మందలించాడని కుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండి

తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన యువతి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని యండగండి గ్రామంలో చోటు చేసుకుంది. ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకోడేరు మండలం మైప గ్రామానికి చెందిన చాట్ల సామియేలు రెండు నెలలు క్రితం యండగండి గ్రామంలో స్థిరపడ్డారు. సామియేలు కుమార్తె సలోమి (18) కుక్క పిల్లను పెంచుకుందామని తండ్రిని అడుగగా తండ్రి సామియేలు మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సలోమి ఇంట్లోంచి వెళ్లిపోయిందని, సమీపంలోని పంట కాలువలో శనివారం సాయంత్రం మృతదేహమై కనిపించిందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన యువతి మృతి

ప్రజాశక్తి - ఉండి

అదృశ్యమైన యువతి చిలుకూరు పంట పొలాల వద్ద ఉన్న కాలువలో మృతి చెంది ఉంది. యువతి కనిపించడంలేదని ఆమె బంధువులు ఉండి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిలుకూరు గ్రామానికి చెందిన యువతి కొంభత్తుల సుశీలమ్మ మతిస్థిమితం లేదు. ఆమె శనివారం మధ్యాహ్నం నుంచి కనబడటం లేదని ఆమె మేనమామ ముప్పల కుమారరత్నం ఆదివారం ఉదయం ఉంచి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం చిలుకూరు పంట పొలాల వద్ద ఉన్న కాలువలో ఆమె మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఉండి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన ఎన్ఆర్‌పి అగ్రహారం చర్చి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉండి గ్రామానికి చెందిన అయికా చల్లయ్య (80) శనివారం రాత్రి ఎన్ఆర్‌పి అగ్రహారం చర్చి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలీని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతను మృతి చెందారు. ఆదివారం కేసు నమోదైనట్లు ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాందువ్వ గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పాందువ్వ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.38,360 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

అన్నదాత అగచాట్లు

పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు

ప్రజాశక్తి - ఆచంట

ఆరుగాలం కష్టించి... ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి.. ఒడిదుడుకులను తట్టుకుని వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి సాయం అందక, బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరించగా రోజురోజుకు పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో కౌలు రైతులు అల్లాడిపోతున్నారు. పంటలు నష్టపోయిన సమయంలో కనీసం పరిహారం సొమ్ములు కూడా వీరికి అందడం లేదు. ఇలా ఓవైపు ప్రకృతి మరోవైపు ప్రభుత్వం కౌలు రైతులతో ఆటలాడుకుంటుంది. అటు సాగును వదులుకోలేక మరో పనులు చేయలేక కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడిపోతున్నారు. తుపాన్ ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షాలు కోతకు వచ్చిన పంట పొలాలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. వర్షపు నీరు చేలను ముంచెత్తడంతో పండిన నాలుగు గింజలను ఒబ్బిడి చేసుకునేందుకు అన్నదాత అష్ట కష్టాలు పడుతున్నాడు.

ఆచంట మండలంలో సుమారు 10,352 ఎకరాల్లో సార్వా వరి సాగు చేస్తున్నారు. పలుచోట్ల కోతకు వచ్చిన వరిచేలు తుపాన్ ప్రభావంతో నేలకొరిగి ముంపునకు గురయ్యాయి. దిగుబడి సగానికి సగం తగ్గిపోయిందని ఆవేదన చెందుతున్నారు. చేతికందిన పంట తడిచిపోవడంతో దళారుల దోపిడీ తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. గ్రామాల్లో మురుగు డ్రెయిన్‌లో నీరు తగ్గకపోవడంతో పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయిందని, ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆచంట మండలంలోని ఆచంట, పెదమల్లం, కోడేరు, కొడమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నేలకొరిగింది. ఆయా పంట పొలాల్లో మురుగునీరుపై వరి దుబ్బులు తేలియాడుతున్నాయి. దీంతో పంట కుళ్లిపోయే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయామని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన కౌలు రైతులకు, క్రాప్ ఇన్సూరెన్స్‌తో పాటు నష్టపరిహారం అందించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


ముంపు నీరును తొలగించుకునేందుకు రైతుల పాట్లు

అప్పులే మిగిలాయి

బాలం గంగాధర్, కౌలు రైతు, ఆచంట వేమవరం



మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని సార్వా సాగు చేస్తున్నాను. అప్పులు చేసి ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టాను. పంట చేతికొచ్చిన సమయంలో తుపాన్ కారణంగా పండిన పంట అంతా నేల వాలింది. పంట అంతా ఇంకా నీటిలోనే నానుతుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కష్టం గంగపాలైంది

కాండ్రేగుల మసేన్, కౌలు రైతు, ఆచంట వేమవరం



12 ఎకరాలు సాగు చేస్తున్నాను. తుపాన్ కారణంగా చేతికొచ్చిన పంట గంగపాలైంది. పెట్టుబడులు కూడా వెనకకు రావడం లేదు. బ్యాంకులో, బయటి నుంచి తెచ్చిన అప్పులు తీర్చాలంటే భారంగా మారింది. వ్యవసాయ రంగంలో రైతు ఆటుపోట్లకు గురవుతున్నాడు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

కొండేటి రామకృష్ణ, కౌలు రైతు, ఆచంట వేమవరం



నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని సాగు చేస్తున్నాను. ఇటీవల సాగు ఖర్చులు, పెట్టుబడులు భారీగా పెరిగాయి. వీటి కోసం రైతులు ఎక్కువగా అప్పులు చేయాల్సి వస్తుంది. ఒకవైపు తుపానులో వరదల కారణంగా రైతులు సాగు పట్ల విసుగుతో ఉన్నారు. ప్రభుత్వం వ్యాపార పారిశ్రామిక రంగాలవారికి రూ.వేల కోట్ల రాయితీలు ఇస్తుంది. అలాంటిది సన్న చిన్న కారు రైతులకు కొంత ప్రయోజనం కల్పిస్తే తప్పేమిటి. కొన్నాళ్లుగా ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవుతుంది. పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

ఇసుక సరఫరా పునరుద్ధరించాలి

ఉపాధి కోల్పోతున్న భవన నిర్మాణ కార్మికులు


ప్రజాశక్తి - పెనుగొండ

45 రోజులుగా మండల పరిసర ప్రాంతాల్లో ఇసుక సరఫరా లేకపోవడంతో ప్రభుత్వం పట్టించుకోవడంతో పెనుగొండ పరిసర గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అప్పుల పాలవుతున్నారని జిల్లా సహాయ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు అన్నారు. సిఐటియు కార్యా లయంలో మెంటే శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇసుక సరఫరాను నిలిపివేయడంతో ఇసుక మూడు యూనిట్లకు రూ.ఏడు వేలు ఉండే ధర నుంచి రూ.12 వేల వరకు చెల్లించాల్సి వస్తుందని, పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారన్నారు. కనీసం చిన్న పనులు కూడా చేయించుకోలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ అరికట్టి వెంటనే ఇసుక సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇసుకతో పాటు బిల్డింగ్ మెటీరియల్ ఐరన్, సిమెంట్, విద్యుత్ పరికరాలు, రంగులు, 50 శాతం ధరలు పెరిగాయని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందించాల్సిన క్లైములు గత నాలుగేళ్లుగా రూపాయి కూడా కార్మికు లకు జగన్ ప్రభుత్వం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జనవరి 8వ తేదీన జిల్లా కేంద్రాల్లో వివిధ ప్రభుత్వ రంగాల్లో జరుగుతున్న ప్రయివేటీకరణ, కేంద్ర ప్రభుత్వ విధానాన్ని, కార్మిక చట్టాలు మార్పు వంటి కార్మిక వ్యతిరేక విధానాలపై భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ ంలో సంఘం కార్యదర్శి పేపకాయల గంగరాజు కార్యకలాపాల రిపోర్టు ప్రవేశపెట్టారు. కుక్కల బాలకృష్ణ, కంబాల ఆదినారాయణ, యెలుగుల నరసింహారావు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగు ఉత్సవాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆకివీడు

వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహిం చనున్న తెలుగు మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల ఉండి నియోజకవర్గ కోకన్వీనర్ పెంకి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమం బ్రోచర్ల స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజరాజ నరేంద్రుని సహస్రబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "ఆంధ్ర మేవ జయతే" అన్న నినాదంతో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవంలో 26 అంశాలకు సంబంధించి 26 సదస్సులు జరుగుతాయన్నారు. తెలుగు భాషాభిమానులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.పార్వతి, ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వరరావు, లీడర్స్ ఫోరం నిర్వాహకులు దాసరి సత్యనారాయణ, బుర్ర ప్రసాద్, విక్రమ్, చంద్ర ప్రభాకరరావు, గుడిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్

కూలిన రైల్వే ప్లాట్‌ఫామ్ గోడ


కూలిపోయిన రైల్వే ప్లాట్ ఫామ్ గోడ

ప్రజాశక్తి - ఉండి

మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఉండి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ గోడ కుప్పకూలిపోయింది. మూడేళ్ల క్రితం గుడివాడ- భీమవరం రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా ఉండి రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించారు. సంవత్సరం గడిచేసరికి ఫ్లాట్‌ఫారం రెండులో కొంతమేర పగుళ్లు వచ్చి బీటలు వారడంతో ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రైల్వే అధికారులు దానిని తిరిగి నిర్మించారు. నాసిరకం సామగ్రి వాడడం వల్ల గోడ కూలిపోయిందని ఉండి ప్రయాణికుల సంఘం కార్యదర్శి చోడవరపు బంగారరావు అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో రైల్వే అధికారులు విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఉండి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఏసుబాబును వివరణ కోరగా వివరణ ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రమేష్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తమకు దీనిపై ఎటువంటి అవగాహన లేదని, తాను మూడు నెలల క్రితమే ఇక్కడకు బదిలీ అయ్యాయని తెలిపారు.

పలుచోట్ల ఘనంగా కార్తీక వనసమారాధన


ఆచంట (పెనుమంట్ర) : షర్మిలారెడ్డిని సత్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)


మార్టేరు రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రాజమండ్రి రుడా ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, షర్మిలారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు, ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, వైసిపి నాయకులు అల్లం భాస్కరరెడ్డి, సత్తి విష్ణుకుమార్‌రెడ్డి, కర్రి జోగిరెడ్డి, వైసిపి నాయకులు, రెడ్డి యూత్ పాల్గొన్నారు. పెనుమంట్రలో ఆదివారం క్షత్రియ వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. దాట్ల విశ్వనాథరాజు, విజయలక్ష్మి దంపతులు, పెనుమంట్రకు చెందిన క్షత్రియ కుటుంబ సభ్యులందరూ సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్రరాజు, పెద్దలు దాట్ల కృష్ణంరాజు, దాట్ల రామరాజు, దాట్ల రంగావతి, పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు శ్రీనివాస రాజు, గాదిరాజు సాయిరామరాజు, దాట్ల సత్యనా రాయణ రాజు, రవివర్మ, సురేష్ రాజు, ఐ.రామరాజు పాల్గొన్నారు.


క్షత్రియ పరిషత్ సేవలు అభినందనీయం : నిమ్మల

పాలకొల్లు :సమాజంలో విద్యా, వైద్య రంగాల్లో ప్రజలకు క్షత్రియ పరిషత్ సభ్యులు చేస్తున్న సేవలను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కొనియాడారు. పాలకొల్లు క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ వన సమారాధన సందర్భంగా ఆదివారం పేద, మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. పేద మహిళ లకు ఉపాధి కల్పించే స్కీంలు అందించారు. టిటిడి సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, నడింపల్లి శ్రీనివాస్ రాజులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంఎల్ఎ పెన్మెత్స విష్ణుకుమార్‌రాజు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, సంఘ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, డిటిడిసి బాబు, కెవి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు :తమ చిన్నారులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని సంఘస్తులకు విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు సూచించారు. మొగల్తూరులోని ఆదివారం హైవే పక్కన కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణులు నిర్వహించారు. ఆ సంఘ మండల శాఖ అధ్యక్షుడు చింతాజి పాండురంగాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ పెద్దలు మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు కడియం సూరిబాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు లక్కోజు సత్తిబాబు, జిల్లా అధ్యక్షులు నక్క చైతన్య శ్రీనివాస్, నాయకులు శివశ్రీ, కడియం సూరిబాబు, లక్కోజు సత్యనారాయణ బిజెపి నాయకులు జెవిఆర్ మాట్లాడారు. ఇటీవల మొగల్తూరు గ్రామానికి చెందిన కొత్తలంక సుబ్రహ్మణ్యం కుమారుడు భవనంపై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం పేరుపాలేనికి చెందిన ప్రముఖ సిద్ధాంతి ఆముదాలిపల్లి వీరబ్రహ్మం, మొగల్తూరు గ్రామానికి చెందిన పట్టణాల చిట్టిబాబు పలువురు సంఘస్తులు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

పాలకొల్లు : బిసిలకు ఇబ్బంది లేకుండా కాపులను బిసిల్లో చేర్చడానికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన కాపుల వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకొల్లులో కాపుల కల్యాణ మండప నిర్మాణం నాలుగు దశాబ్దాల కల అని చెప్పారు. రానున్న ప్రభుత్వంలో కాపుల కల్యాణ మండపానికి రూ.3 కోట్లు ప్రభుత్వం నుంచి తెచ్చి పూర్తి చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత బన్నీ వాసు, యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, కామిశెట్టి అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ వనసమారాధనలో పాల్గొన్నారు.



పాలకొల్లు : మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు


ఆర్థిక సాయం అందిస్తున్న క్లబ్ సభ్యులు

రోగికి యునైటెడ్ కాపు క్లబ్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

అనారోగ్య బాధితునికి యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ తరపున ఆర్థిక సాయం అందించారు. స్థానిక దీప్తి స్కూల్ ఆవరణలో యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ సమావేశం అధ్యక్షులు గాదె ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ డొనేషన్‌లో భాగంగా అనారోగ్యంతో ఉన్న జాయిన వెంకటేశ్వరరావు (జాని)కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. దానిలో రూ.ఐదు వేలు క్లబ్ నుంచి, మిగతా రూ.ఐదు వేలు దాతల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, కార్యదర్శి పశ్యావుల రవికుమార్, కోశాధికారి యినుకొండ శేషాద్రి, ముచ్చర్ల సత్యనారాయణ, ముచ్చర్ల శ్రీనివాస్, కర్ర నరసింహారావు, పశ్యావుల రవీంద్రనాయుడు, పులపర్తి రాము పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎంఎల్ఎ రామరాజు

'బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం బాగుపడాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, దోపిడీలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, గోకరాజు నాగరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు నడింపల్లి విశ్వనాథరాజు, బొత్స గణేష్, దాసరి దాలినాయుడు, నేరేడిమిల్లి రాజేష్, శ్రీరాములు, బొత్స లక్ష్మీనారాయణ, దాసరి గిరిప్రసాద్, రఘు మండల సత్యనారాయణ, నరసింహమూర్తి, దాసరి ఏసు, కె.సుధాకర్ పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను ఆదివారం యాత్రికులు దర్శించుకున్నారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు చర్చి ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 11వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు ఆచంట కాపులపాలెం రంగాబొమ్మ సెంటర్ సమీపంలో క్రీస్తు ప్రార్ధన మందిరం, నూతన మందిర ప్రతిష్ట ఆరాధన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ ప్రార్ధన మందిర సంఘ కాపరి గాదిరాజు తిమోతిరాజు తెలిపారు. ఈ నూతన ప్రతిష్ట కార్యక్రమాన్ని భీమవరం క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఛైర్మన్, సిఐసి సంఘ అధినేత బ్రదర్ మేడిద జాన్సన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.